క్లుప్తంగా

కూటమి పాలకుల అనైతిక చర్యలను ఖండించాలి



మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిసిన చిటికెన శ్రీనివాస్

కొయ్యలగూడెం: ప్రజాక్షేత్రంలో కూటమి పాలకుల అనైతిక చర్యలను ఎండగట్టాలని మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆదేశించినట్లు ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా గౌడ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ చిటికెన శ్రీనివాస్ తెలిపారు. పార్టీ అధినేతను ఆదివారం మర్యాదపూర్వకంగా కలిసి పోలవరం నియోజకవర్గంలో పార్టీ శ్రేణులపై జరుగుతున్న దాడులను, హింసాత్మక చర్యల గురించి వివరించినట్లు చెప్పారు. అంతే కాకుండా కొందరి అధికారులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతూ వివాదాలు సృష్టిస్తున్నట్లు వివరించానన్నారు. పోరాటాలు మనకు కొత్తేమీ కాదని, కూటమి హామీల అమలుపై ప్రజలతో కలసి పోరాడాలని, వైఎస్సార్‌సీపీ శ్రేణులకు అండగా నిలబడి ముందుకు సాగాలని పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సూచించారన్నారు.

ద్వారకాతిరుమల ఎస్సైగా సుధీర్



టి.సుధీర్, ద్వారకాతిరుమల ఎస్సై

ద్వారకాతిరుమల: ద్వారకాతిరుమల ఎస్సైగా టి.సుధీర్‌ను నియమిస్తూ జిల్లా ఎస్పీ కొమ్ము ప్రతాప్ శివకిషోర్ ఆదివారం ఉత్తర్వులు జారీ చేశారు. 2022 మే 9న ఏలూరు వన్‌టౌన్ పోలీ స్టేషన్ నుంచి బదిలీపై ద్వారకాతిరుమల స్టేషన్‌కు వచ్చిన ఆయన, సార్వత్రిక ఎన్నికల ముందు లక్కవరం స్టేషన్‌కు బదిలీ అయ్యారు. తిరిగి సుధీర్ ఇప్పుడు ద్వారకాతిరుమల స్టేషన్‌కు బదిలీపై వచ్చారు. ప్రస్తుతం ఇక్కడ విధులు నిర్వర్తిస్తున్న ఎస్సై జి.సతీష్‌ను ఏలూరు వీఆర్‌కు బదిలీ చేశారు.

కొయ్యలగూడెం ఎస్సైగా చంద్రశేఖర్



వర్రె చంద్రశేఖర్

కొయ్యలగూడెం: కొయ్యలగూడెం ఎస్సైగా వర్రె చంద్రశేఖర్ నియమితులయ్యారు. ఈ మేరకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా బిక్కవోలు గ్రామానికి చెందిన చంద్రశేఖర్ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో తాడేపల్లిగూడెం, చేబ్రోలు జీలుగుమిల్లి, నల్లజర్ల, పీఎస్ లలో విధులు నిర్వహించినట్లు పేర్కొన్నారు.

ప్రభుత్వ కళాశాల విద్యార్థికి జేఎన్‌టీయూలో సీటు

ఉంగుటూరు: నారాయణపురం మహాత్మాగాంధీ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్మీడియెట్ చదివిన వడలి నిర్మల్‌కు విజయనగరం జేఎన్‌టీయూ కళాశాలలో ఇంజనీరింగు సీటు లభించింది. గతేడాది ఈ కళాశాలలో నిర్మల్ ఇంటర్ చదివాడు. ఈ విద్యార్థి ఇంజనీరింగు సెట్‌లో సత్తాచాటి జేఎన్‌టీయూలో మెకానికల్ సీటు సాధించాడు. ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు, అధ్యాపకులు ఆ విద్యార్థిని అభినందించారు.

కరెంటు కోత... ఉక్కపోత

దెందులూరు: దెందులూరు నియోజకవర్గంలో కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత ప్రతి రోజూ గంటన్నర కరెంటు కోత విధిస్తున్నారు. కారణాలు ఏమైనప్పటికీ అప్రకటిత అనధికారిక కరెంటు కోత వల్ల గ్రామ శివారు ప్రాంతాల్లో ప్రజలు తీవ్ర అసౌకర్యానికి గురవుతున్నారు. సాయంత్రం అధికంగా రాత్రివేళల్లో కరెంటు కోతల వల్ల గృహ వినియోగదారులు, వైద్యశాల సిబ్బంది తీవ్ర ఇక్కట్లు ఎదుర్కొంటున్నారు. వర్షాకాలంలో ప్రతిరోజూ గంట నుంచి గంటన్నర వరకూ కరెంటు కోత విధిస్తే జనవరి నుంచి జూన్ వరకు ఎన్ని గంటలు కరెంటు కోత ఉంటుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. కూటమి నాయకులు, ఉన్నతాధికారులు గ్రామాల్లో కరెంటు కోత విధించకుండా చర్యలు తీసుకోవాలని గ్రామీణ ప్రాంతవాసులు కోరుతున్నారు.

మలాథియాన్ స్ప్రేయింగ్

బుట్టాయగూడెం: మండలంలోని మారుమూల గ్రామమైన వీరమద్దిగూడెం, ముప్పినవారిగూడెం గ్రామాల్లో జరుగుతున్న మలాథియాన్ స్ప్రేయింగ్ పనులను మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ పి.పెద్దిరాజు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మలేరియా నివారణకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు.

గాలాయగూడెంలో రెండు కుటుంబాల ఘర్షణ

దెందులూరు: గాలాయగూడెంలో రెండు కుటుంబాల మధ్య సీసీ కెమెరాకు సంబంధించి ఘర్షణ, కొట్లాట ఆదివారం జరిగింది. ఈ సంఘటనలో ఇరు కుటుంబ సభ్యులు గాయపడటంతో వైద్యచికిత్స నిమిత్తం ఏలూరు వైద్యశాలకు తీసుకెళ్లారు.

ప్రభుత్వ పాఠశాలలపై నిర్లక్ష్యం

- వేధిస్తున్న ఉపాధ్యాయుల కొరత
- నెరవేరని విద్యాకానుక
- టోఫెల్ విద్య సైతం దూరం
- అమ్మకు వందనం ఊసే లేదు
- కూటమి ప్రభుత్వంలో విద్యార్థులకు తిప్పలు



కుక్కునూరు మండలం దామచర్లలో పూరి గుడిసెలోనే నిర్వహిస్తున్న ప్రాథమిక పాఠశాల

- బుట్టాయగూడెం మండలంలో ఒక ఉపాధ్యాయ పోస్టు, కుక్కునూరు మండలంలో ప్రైమరీ స్కూల్స్‌కు సంబంధించి 22 మంది ఉపాధ్యాయులు, హైస్కూల్‌కు సంబంధించి ఒక పీడీ పోస్టు, ఒక ఫిజిక్స్ ఉపాధ్యాయుల పోస్టులు ఖాళీగా ఉన్నాయి.
- కుక్కునూరు మండలంలో 120 మంది విద్యార్థులకు ఇప్పటికీ షూలు ఇవ్వాల్సి ఉందని అధికారులు చెబుతున్నారు. దామరచర్ల ప్రైమరీ పాఠశాలకు భవనం లేక పూరి గుడిసెలోనే విద్యార్థులకు చదువు చెబుతున్న దుస్థితి.
- జంగారెడ్డిగూడెం మండలంలో 8 మంది ఉపాధ్యాయులు ఇటీవల ఉద్యోగ విరమణ చేశారు. ఆ స్థానాలు ఖాళీగా ఉన్నట్లు అధికారులు తెలిపారు.



బుట్టాయగూడెం, చింతలపూడి: ప్రభుత్వ పాఠశాలలపై చంద్రబాబు ప్రభుత్వం నిర్లక్ష్య ధోరణి అవలంబిస్తోంది. దీంతో విద్యార్థులకు సైతం తిప్పలు తప్పడం లేదు. గత వైఎస్సార్ సీపీ పాలనలో ప్రభుత్వ పాఠశాలలు అభివృద్ధిలో పరుగులు పెట్టాయి. పాఠశాల తెరిచిన రోజునే విద్యాకానుక రూపంలో పాఠ్యపుస్తకాలు, యూనిఫాం, బూట్లు అందించారు. అలాగే నాడు నేడులో పాఠశాల భవనాలను సైతం ఆధునీకరించి కార్పొరేట్ హంగులతో తీర్చిదిద్దారు. అమ్మ ఒడి రూపంలో విద్యాభివృద్ధికి ప్రతి తల్లికి రూ.15 వేలు చొప్పున అందజేశారు. అలాగే విద్యార్థులు ఇంగ్లిషు మీడియంలో సైతం రాణించేలా టోఫెల్ విద్యా విధానాన్ని అమలు చేశారు. దీంతో ప్రభుత్వ పాఠశాలలు ఓ వెలుగు వెలిగాయి. అయితే ప్రస్తుతం ప్రభుత్వం మారడంతో పాఠశాలల పరిస్థితి చంద్రగ్రహణం పట్టినట్లుగా తయారయ్యాయి. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు గడుస్తున్నా ఇప్పటికీ కొన్నిచోట్ల విద్యాకానుక సక్రమంగా అందించలేదు. అలాగే పలు పాఠశాలల్లో ఉపాధ్యాయుల కొరత వేధిస్తోంది. అంతేకాదు టోఫెల్ విద్యావిధానాన్ని విద్యార్థులకు దూరం చేసేలా చంద్రబాబు ప్రభుత్వం వ్యవహరిస్తోంది. టోఫెల్‌కు పీరియడ్లు కూడా పెట్టకూడదని ప్రభుత్వం ఇటీవల నిర్ణయించినట్లు తెలిసింది. అలాగే తల్లికి వందనం కింది ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇస్తామని ఎన్నికల్లో హామీ ఇచ్చినా ఇప్పుడు ఆ ఊసే ఎత్తడం లేదు.

భౌతిక శాస్త్రం ఉపాధ్యాయుడు లేరు



మా అమ్మాయి జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 7వ తరగతి చదువుతోంది. పాఠశాలలో భౌతిక శాస్త్రం భోదించేందుకు ఉపాధ్యాయుడు లేరు. దీంతో విద్యార్థులు ఆ సబ్జెక్టుకు సంబంధించి ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వం వెంటనే భౌతిక శాస్త్ర ఉపాధ్యాయుడిని నియమించాలి. ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులను వెంటనే భర్తీ చేయాలి

– వనమా వీరభద్రం, కుక్కునూరు

టోఫెల్ విద్యా బోధన అవసరం



ఇంగ్లిష్‌లో మెరుగైన విద్యాబోధన కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం టోఫెల్ విధానాన్ని ప్రవేశపెట్టింది. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు టోఫెల్ పద్ధతిలో విద్యాబోధనం చేయడం అత్యంత అవసరం. కూటమి ప్రభుత్వం సమీక్ష పేరుతో పేద విద్యార్థులకు టోఫెల్‌ను దూరం చేయడం తగదు. టోఫెల్ విద్యా విధానాన్ని అమలు చేయాల్సిందే. అదేవిధంగా వెంటనే తల్లికి వందనం సొమ్ములు అందచేయాలి.

– డా బి రాంబాబు నాయక్, ఎంపీపీ, చింతలపూడి

ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయాలి



పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయుల పోస్టులను భర్తీ చేయాలి. కొందరు విద్యార్థులకు షూలు, యూనిఫాం అందలేదు. వారికి వెంటనే యూనిఫాం, షూలు అందించే విధంగా కృషి చేయాలి. తల్లికి వందనం పథకంలో ప్రతి విద్యార్థికి సంబంధించి తల్లులకు సొమ్ములు అందించాలి. లేనిపక్షంలో ఆందోళనలు చేపడతాం.

– బన్నే వినోద్‌కుమార్, పీడీఎస్‌యూ నాయకుడు, బుట్టాయగూడెం

తల్లికి వందనం డబ్బులు ఎప్పుడిస్తారు?



తల్లికి వందనం కింద ప్రతి విద్యార్థికి రూ.15 వేలు చొప్పున ఇస్తానన్నారు. ఇప్పటివరకు ఆ డబ్బులు అందించకపోవడంతో పిల్లల తల్లిదండ్రులు స్కూల్ ఫీజులు కట్టలేక ఇబ్బందులు పడుతున్నారు. గత ప్రభుత్వ హయాంలో ప్రతి ఏడాది పాఠశాల ప్రారంభించే నాటికే విద్యార్థులకు యూనిఫాం, పాఠ్య పుస్తకాలు అందించడంతో పాటు అమ్మఒడి అందించేవారు.

– కడిమి రమేష్, జెడ్పీటీసీ, కామవరపుకోట

విజయదుర్గమ్మకు ప్రత్యేక పూజలు



విశేషాలంకరణలో విజయ కనకదుర్గమ్మ

పోలవరం రూరల్: పోలవరం మండలం గూటాల గ్రామంలో వేంచేసి యున్న విజయ కనకదుర్గమ్మ ఆలయంలో ఆషాఢ మాసం అమావాస్య సందర్భంగా ఆదివారం ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. అర్చకులు హనుమంతుల వర్జుల సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి చండీహోమం నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో భాగంగా విఘ్నేశ్వరపూజ, మండపారాధన, పంచామృతాభిషేకం, చండీహోమం నిర్వహించారు. అధికసంఖ్యలో గ్రామస్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

సామ్రాజ్యవాద దేశాలు యుద్ధానికి కాలుదువ్వుతున్నాయి



సమావేశంలో మాట్లాడుతున్న టి.సుధాకర్

జంగారెడ్డిగూడెం: ప్రపంచంపై ఆధిపత్యం కోసం మరోమారు సామ్రాజ్యవాద దేశాలు యుద్ధానికి కాలు దవ్వుతున్నాయని సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ పేర్కొన్నారు. భారత కార్మిక సంఘాల సమాఖ్య (ఇఫ్టూ) జంగారెడ్డిగూడెం డివిజన్ రాజకీయ తరగతులు ఆదివారం ధర్మన్న స్మారక భవనంలో నిర్వహించారు. డివిజన్ ప్రధాన కార్యదర్శి మంచిలి రాజు అధ్యక్షతన జరిగిన ఈ రాజకీయ తరగతులలో జాతీయ అంతర్జాతీయ పరిస్థితులపై సీపీఐఎంఎల్ న్యూడెమోక్రసీ ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లా కార్యదర్శి టి.సుధాకర్ మాట్లాడారు. ప్రపంచ దేశాలపై ఆధిపత్యం కోసం, ఆయిల్ దేశాలపై ఆధిపత్యం కోసం మరోసారి సామ్రాజ్యవాద దేశాలు యుద్ధానికి కాలు దువ్వుతున్నాయన్నారు. యుద్ధం గనక వస్తే ప్రపంచవ్యాప్తంగా కోట్లాదిమంది ప్రజల జీవన విధానం చిన్నా భిన్నం అవుతాయని అన్నారు. నిత్యవసర వస్తువుల ధరలు ఇంకా పెరిగిపోతాయని, ఉపాధి అవకాశాలు దెబ్బతింటాయని ఇటువంటి యుద్ధాన్ని భారతదేశం తీవ్రంగా వ్యతిరేకించాలన్నారు. దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్మిక హక్కులను కాలరాస్తూ కార్పొరేట్ సంస్థలకు ఊడిగం చేస్తుందని విమర్శించారు. ఈ నేపథ్యంలో యువత పోరాటాలకు సిద్ధం కావాలని సుధాకర్ పిలుపునిచ్చారు. అనంతరం ఇఫ్టూ రాష్ట్ర కోశాధికారి కేవీ రమణ రాష్ట్ర కమిటీ సభ్యులు సరియం రామ్మోహన్, సీనియర్ న్యాయవాది యు.ఏసుబాబు, అంగన్‌వాడీ యూనియన్ నాయకులు కొమరం మారమ్మ మాట్లాడారు. వివిధ సంఘాల ఇఫ్టూ నాయకులు యడ్లపల్లి బుజ్జియ్య, వాసుబోయిన శ్రీను, పాకిరం రాజేష్, బాల నరేష్, ఎంఎల్ఎన్ రాజు, తగరం బాబురావు, బి.ఆకాష్, గురుగుంట్ల పద్మ తదితరులు పాల్గొన్నారు.

బురదమయంగా పాఠశాల ఆవరణ



బురదమయంగా యర్రగుంటపల్లి శివారు మెతుకుమెల్లిగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణ

చింతలపూడి: చింతలపూడి మండలం, యర్రగుంటపల్లి శివారు మెతుకుమెల్లిగూడెం ప్రాథమిక పాఠశాల ఆవరణలో వరదనీరు నిలిచిపోయి ఉపాధ్యాయులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ పాఠశాలలో 25 మంది విద్యార్థులు చదువుతున్నారు. ఇటీవల కురుస్తున్న వర్షాలకు పాఠశాల ఆవరణలో నీరు నిలిచిపోయి తరగతి గదుల్లోకి వెళ్లేందుకు సైతం పిల్లలు తీవ్ర అవస్థలు ఎదుర్కొంటున్నారని తల్లిదండ్రులు వాపోతున్నారు. గతంలో అనేకసార్లు గ్రామస్తులు, ఉపాధ్యాయులు పాఠశాల దుస్థితిపై అధికారులకు, ప్రజాప్రతినిధులకు మొరపెట్టుకున్నా పట్టించుకోలేదని వాపోతున్నారు. తక్షణం పాఠశాల ఆవరణలో వరద నీరు నిలబడకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేస్తున్నారు.

ముర్రిపాలలో వ్యాధి నిరోధక శక్తి మెండు



తిమ్మనకుంటలో గర్భిణులకు సీమంతం నిర్వహిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: ఎర్రంపేట తిమ్మనకుంట గ్రామ అంగన్‌వాడీ కేంద్రం వద్ద ఆదివారం తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఐసీడీఎస్ శాఖ సూపర్‌వైజర్ అంబటి సరస్వతి ఆధ్వర్యంలో అంగన్‌వాడీ కేంద్రాన్ని సుందరంగా అలంకరించి గర్భిణులకు సీమంతం, బాలింతలకు పసుపు కుంకుమ కార్యక్రమం నిర్వహించారు. అనంతరం తల్లిపాల ప్రాముఖ్యత గురించి వివరించి బిడ్డ ఎదుగుదలపై అవగాహన కల్పించారు. ముఖ్యంగా ముర్రిపాలు వ్యాధి నిరోధకత గురించి తెలిపారు. రెండు సంవత్సరాల వరకు బిడ్డకు తల్లి పాలు పట్టాలని, బిడ్డకు బిడ్డకు మధ్యగల కాన్పుకి దూరంపై అవగాహన కల్పించారు. ఈనెల 7వ తేదీ వరకు ప్రాజెక్టు పరిధిలో అన్ని కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పీఓ స్వర్ణకుమారి పేర్కొన్నారు. అంగన్‌వాడీ కార్యకర్తలు కె విజయకుమారి, ఎం.మాధవి, ఎం.కనకదుర్గ, కె.రాణిరత్నం, పద్మ, వార్డు సభ్యులు ఎం.లక్ష్మీకాంతం తదితరులు పాల్గొన్నారు.

ఆదివాసీలు ఐక్యంగా పోరాడాలి



సమావేశంలో ఆదివాసి దినోత్సవ కరపత్రాన్ని ఆవిష్కరిస్తున్న ఆదివాసీ గిరిజన సంఘం నేతలు

వేలేరుపాడు: భారత రాజ్యాంగంలో కల్పించిన హక్కులు, చట్టాలు పూర్తిగా అమలు అవ్వాలంటే ఆదివాసులందరూ ఐక్యంగా పోరాడాలని ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు ధర్ముల రమేష్ పిలుపునిచ్చారు. వేలేరుపాడు మండల కేంద్రంలో ఏఎస్‌పీ కార్యాలయంలో ఆదివారం నిర్వహించిన ఆదివాసీ, గిరిజన సంఘాల ఉమ్మడి సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు మడివి దుర్గారావు, ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల కార్యదర్శి ఊకె ముత్యాలరావు, ఆదివాసీ మహా సభ్యురాలు మడకం సునీత, మడకం రజిని మాట్లాడుతూ దేశంలోనే ఆదివాసీలపై ఈ మధ్య కాలంలో దాడులు పెరిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. అభివృద్ధికి ఆధారమైన జీవో నెం 03 ను సుప్రీంకోర్టు కొట్టేస్తే ప్రభుత్వాలు స్పందించలేదని, అంటే ఆదివాసీలను విస్మరించడమే అని విమర్శించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకు సభలో ఇచ్చిన హామీ ప్రకారం జీవో నెం 03 కు చట్ట బద్ధత కల్పించాలని డిమాండ్ చేశారు. ఈనెల 9న ప్రపంచ ఆదివాసి దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయలని కోరారు. అనంతరం కరపత్రం ఆవిష్కరించారు.

ధర్మ రక్షాబంధన్‌ను విజయవంతం చేయండి



రామాలయం వద్ద కార్యక్రమంలో మాట్లాడుతున్న రామకృష్ణ

కొయ్యలగూడెం: రాఖీ పౌర్ణమి నేపథ్యంలో చేపట్టే ధర్మ రక్షాబంధన్ కార్యక్రమం విజయవంతం చేయాలని సమరసత ఫౌండేషన్ జిల్లా సహాయ కన్వీనర్ తిప్పాపాటి రామకృష్ణ పేర్కొన్నారు. ఆదివారం శ్రీరాంనగర్ వాటర్ ట్యాంకు రామాలయం వద్ద నిర్వహించిన మండల స్థాయి సమావేశానికి ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ఈ నెల 19వ తేదీ రాఖీ పౌర్ణమి (రక్షాబంధన్) రానుందని, హిందూ మతానికి చెందిన అన్ని వర్గాలవారు ఈ వేడుకను నిర్వహించుకునేలా ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నామన్నారు. జిల్లాలోని అన్ని రామాలయాల వద్ద ఈ కార్యక్రమాలు రక్షా బంధన్ రోజు వరకు కొనసాగిస్తామన్నారు. అందుకు సంబంధించిన రాఖీ మాలలను స్థానిక ప్రజలకు ఉచితంగా అందజేశారు. ధర్మ ప్రచారకులు మంగళగిరి సత్తిబాబు, పేరుబోయిన రమేష్, ఇళ్ల లక్ష్మణరావు, సంసాని దుర్గారావు, సిద్ధ రావు పాల్గొన్నారు.

తేరుకున్న పంట పొలాలు



ముంపు నుంచి బయటపడిన పంట పొలాలు

పోలవరం రూరల్: పోలవరం మండలంలో ముంపునకు గురైన పంట పొలాలు వరదనీటి ముంపు నుంచి బయటపడ్డాయి. గత వారం రోజులుగా కొండవాగుల ఉధృతి, గోదావరి ఎగపోటు నీటితో ముంపునకు గురైన నాట్లు వేసిన పొలాలు, వరి ఆకుమడులు ముంపు నుంచి తేరుకున్నాయి. దెబ్బతిన్న పంట పొలాలను సర్వే చేపట్టినట్లు మండల వ్యవసాయ శాఖ అధికారి కె.రాంబాబు తెలిపారు. రైతులతో కలిసి సిబ్బంది దెబ్బతిన్న పొలాలను సర్వే చేపట్టి జాబితా తయారు చేయడం జరుగుతుందన్నారు.

ఏలూరు సిటీ పాస్టర్స్ అసెంబ్లీ ఏర్పాటు

ఏలూరు (ఆర్‌ఆర్‌పేట): నగరానికి చెందిన అన్ని క్రైస్తవ సంఘాల ప్రతినిధులు కలిపి సిద్ధాంత బేధాలు లేకుండా ఉండేందుకు నూతనంగా సిటీ పాస్టర్స్ అసెంబ్లీగా ఏర్పడినట్లు ఆ సంస్థ ప్రతినిధులు తెలిపారు. ఆదివారం సాయంత్రం స్థానిక గవరవరంలోని ఫ్రెండ్స్ ఆఫ్ గాడ్ చర్చిలో సమావేశమై సంస్థ నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. సంస్థ చీఫ్ ప్యాట్రన్‌గా బిషప్ కారుపాటి శాంతి సాగర్, బిషప్ జి.సుభద్రరావు, పి.జీవన్ కుమార్ ఎన్నికయ్యారు. అధ్యక్షునిగా కె.సుదర్శన్ బాబు, కార్యదర్శిగా ఇ.రత్న ప్రసాద్, కోశాధికారిగా జోసఫ్ చిక్కాల, ఉపాధ్యక్షులుగా కె.జీవానందం, జి.జాన్ పీటర్, ఇ.గ్రేస్ జాన్, జాయింట్ సెక్రెటరీగా టి.ఆనంద్ కుమార్, ఎగ్జిక్యూటివ్ మెంబర్స్‌గా శేఖర్ బాబు, బి.జోసఫ్, ఎస్ దాసు, ఆదామ్ సురేష్, ఎం ప్రశాంత్ బాబు, జేమ్స్ విజయ్ కుమార్, జి.ఏసు పాదం నియమితులయ్యారు.

వర్గీకరణతో దళితుల అణచివేత

గణపవరం: వర్గీకరణకు అనుకూలంగా సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పు దళితుల అభ్యున్నతికి ఏమాత్రం ఉపయోగపడదని, దళితుల అణచివేతకు మాత్రమే వర్గీకరణ దోహదపడుతుందని అంబేద్కర్ ఇండియా మిషన్ సభ్యులు అన్నారు. సుప్రీంకోర్టు ఇచ్చిన తీర్పుకు నిరసనగా ఆదివారం అంబేద్కర్ విగ్రహం వద్ద అంబేద్కర్ ఇండియా మిషన్ ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. ఏఐఎం సభ్యులు బి.నాగేశ్వరరావు, బళ్లారి అశోక్ మాట్లాడుతూ సుప్రీం తీర్పు రాజ్యాంగంలోని ఆర్టికల్ 341కు వ్యతిరేకంగా ఉందన్నారు. సీనియర్ నాయకుడు కట్టూరి ప్రసాద్ మాట్లాడుతూ సుప్రీంకోర్టు తీర్పును వెనక్కు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

విద్యార్థినికి ఆర్థిక సహాయం



ఆర్థిక సహాయాన్ని అందిస్తున్న వెంకటేశ్వరరావు తదితరులు

జంగారెడ్డిగూడెం: పట్టణానికి చెందిన ఇంజినీరింగ్ విద్యార్థిని పద్మనాభుని గాయత్రికి కిరాణా వర్తకులు దూబగుంట్ల వెంకటేశ్వరరావు రూ.25 వేలు అందజేశారు. గత మూడేళ్లుగా ఆమె విద్యకు ఈవిధంగా ఆయన తోడ్పాటు అందిస్తున్నారు. దీనిలో భాగంగా నాలుగో సంవత్సరానికి సంబధించి ఈ మొత్తాన్ని ఆయన అందించారు. కార్యక్రమంలో నాగసూరి బాలసుబ్రహ్మణ్యం, ఉప్పలమెట్ట వాసవి క్లబ్ కపుల్స్ అధ్యక్షుడు గొల్లపూడి మురళీకృష్ణ, కార్యదర్శి కొనకల్ల శ్యామ సత్యనారాయణ, కోశాధికారి బీవీ సత్యనారాయణ, సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడికి గాయాలు



రోడ్డు ప్రమాదంలో గాయపడిన యువకుడు

కుక్కునూరు: భూర్గంపాడు వద్ద జరిగిన రోడ్డు ప్రమాదంలో మండలానికి చెందిన యువకుడు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి,. లచ్చిగూడెం గ్రామానికి చెందిన మడివి రాజుగా భద్రాచలం నుంచి కుక్కునూరు వైపు తన బైక్‌పై వస్తుండగా భూర్గంపాడు మిల్లు సెంటర్ వద్ద బైక్ అదుపు తప్పి కింద పడిపోయాడు. ఈ ప్రమాదంలో మడివి రాజు తలకు తీవ్ర గాయాలు కావడంతో అతడిని ఆటోడ్రైవర్లు, స్థానికులు 108 అంబులెన్స్‌లో భద్రాచలం ఆసుపత్రికి తరలించారు.

చిట్టిరాజుకు అభినందనలు



చిట్టిరాజును సత్కరిస్తున్న ప్రజాప్రతినిధులు, యువజన నాయకులు

కొయ్యలగూడెం: ఐపీఎస్ సర్వీస్‌కి ఎంపికైన మోషన్ చిట్టిరాజును కొయ్యలగూడెం మండలానికి చెందిన ప్రజాప్రతినిధులు, వైఎస్సార్‌సీపీ యువజన నాయకులు ఆదివారం కలిసి అభినందనలు తెలిపారు. చిట్టిరాజు దేశంలోనే అత్యున్నత కోర్సులలో ఒకటి అయిన ఐపీఎస్‌కు ఎంపిక కావడం దళితులకు గర్వకారణంగా ఉందని ఎంపీటీసీ బిరుదుగట్ల రత్నకుమార్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈనెల 26వ తేదీ నుంచి ముస్సూరీలో నిర్వహించే శిక్షణ కేంద్రంలో పాల్గొనడానికి వెళ్తున్నట్లు చిట్టిరాజు పేర్కొన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ కడగట్ల గడ్డి గడ్డియ్య, బి.ప్రేమ్‌కుమార్, తదితరులు పాల్గొన్నారు.

ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి దరఖాస్తుల ఆహ్వానం

బుట్టాయగూడెం: ఐటీఐ కోర్సుల్లో ప్రవేశానికి మూడో విడత అడ్మిషన్ల కోసం దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ బి.శివయ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఫిట్టర్, డీజిల్ మెకానిక్ కోర్సులకు సంబంధించి 10వ తరగతి పాస్ అయి ఉండాలని చెప్పారు. ఫిట్టర్‌కు రెండేళ్లు, డీజిల్ మెకానిక్‌కు ఒక సంవత్సరం శిక్షణ ఉంటుందన్నారు. వెల్డర్‌కు సంబంధించి 8వ తరగతి పాసై ఉండాలని, వీరికి ఏడాదిపాటు శిక్షణ ఇవ్వడం జరుగుతుందని చెప్పారు. అభ్యర్థులు ఈ నెల 26 లోగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

వయనాడ్ బాధితులను ఆదుకోవాలి

గణపవరం: కేరళలోని వయోనాడ్‌లో జరిగిన విపత్తులో బాధితులకు ప్రతి ఒక్కరూ బాసటగా నిలవాలని సీపీఎం నాయకులు అన్నారు. ఆదివారం గణపవరం మండలం పిప్పరలో సీపీఎం ఆధ్వర్యంలో ప్రజల నుంచి వయోనాడ్ బాధితులకు ఆర్థిక సహాయం అందించాలంటూ విరాళాలు సేకరించారు. గ్రామంలోని ప్రతి ఇంటికీ, షాపులకు వెళ్లి తోచిన సహాయం అందించాలని కోరారు. మండల వ్యాప్తంగా విరాళాలు స్వీకరించి బాధితులకు అందజేస్తామని తెలిపారు. సీపీఎం నాయకులు పి.గోవింద్, పి.నర్సింహమూర్తి, సంజీవరావు, జి.శ్రీనివాస్ పాల్గొన్నారు.